సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023











ఘనంగా కృష్ణాష్టమి

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో అలరించారు. ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు అల్లెంకి శ్రీనివాస్, రజనీ, దాసరి ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి పాల్గొన్నారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయిబాబా ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్, గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు ఓదెలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

10న చాకలి ఐలమ్మ వర్ధంతి సభ

- కరపత్రాలు ఆవిష్కరించిన జెడ్పీ చైర్మన్ మధు



కరపత్రం ఆవిష్కరిస్తున్న మధు

మంథని: ఈనెల 10న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని మంథనిలో నిర్వహించనున్నట్లు జెడ్పీ చైర్మన్ పుట్ట మధు తెలిపారు. ఈ మేరకు గురువారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఐలమ్మ జయంతిని రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. ఐలమ్మ వర్ధంతి సభకు నియోజకవర్గంలోని అభిమానులు, పోరాటయోధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, ఎంపీపీ కొండ శంకర్, వైస్ చైర్మన్ ఆరెపల్లికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్ గౌడ్, నాయకులు పోతరాజు సమ్మయ్య, స్వరూప్, ఆకుల కిరణ్ తదితరులు ఉన్నారు.

నిరుపేదల ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందిస్తాం

- డీసీసీ అధ్యక్షులు ఎంఎస్.రాజ్‌ఠాగూర్



ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే నిరుపేదల ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందిస్తామని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాకూర్ తెలిపారు. గురువారం హాథ్‌సేహాథ్ జోడోయాత్రలో భాగంగా 7వ డివిజన్‌లో పర్యటించారు. రేషన్ షాపుల ద్వారా 9 రకాల నిత్యావసర వస్తువులు అందిస్తామని, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు రూ.4వేలు చెల్లిస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. నిరుద్యోగ భృతి, సింగరేణి కార్మికుల మారుపేర్ల మార్పు, దళితులను మూడెకరాల భూమి అందించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కంకణాల రాజు, ఎండీ.ముస్తాఫా, నాజిముద్దీన్, కిరణ్, బాదం వసంత తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సభ్యత్వం ఇవ్వాలి



భాస్కర్‌ను సన్మానిస్తున్న రమేశ్

సుల్తానాబాద్: అర్హులైన మత్స్యకారులకు కొత్తగా సభ్యత్వం ఇవ్వాలని డీఎఫ్ఓ భాస్కర్‌కు బీసీ సంక్షేమ యువజన సంఘ సభ్యులు విన్నవించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో భాస్కర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల రమేశ్, మండల అధ్యక్షుడు చొప్పరి సంతోష్ కలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా యువకులు అత్యధిక మంది మత్స్యకార్మిక వృత్తిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని, ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా పరీక్షలు నిర్వహించి సభ్యత్వం ఇవ్వాలని విన్నవించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు ముదిరాజులకు అందేలా చూడాలని కోరారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

మంథని: మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 9న మంథని కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిగౌడ్ అన్నారు. రాజీమార్గమే రాజమార్గమని సూచించారు.

ఎన్టీపీసీని సందర్శించిన బీహెచ్‌ఈఎల్ డైరెక్టర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్) డైరెక్టర్ తేజిందర్‌గుప్తా పర్యటించారు. గురువారం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిభవన్ నుంచి తెలంగాణ స్టేజీ-1లో నిర్మితమవుతున్న 1600 మెగావాట్ల ప్రాజెక్టులో బీహెచ్‌ఈఎల్ సంస్థ చేపట్టిన పనులు పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు.

రేషన్ రీసైక్లింగ్..!

- రేషన్ దుకాణాల నుంచి నేరుగా మిల్లులకు
- జిల్లాలో జోరుగా సాగుతున్న దందా
- మంచిర్యాల మీదుగా మహారాష్ట్రకు తరలుతున్న వైనం

➡ గతనెల 18న.. సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి శివారు రాజీవ్ రహదారి మీదుగా అక్రమంగా తరలుతున్న 159 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు.

➡ గతనెల 16న పెద్దపల్లి మండలం అప్పన్నపేటలో లబ్ధిదారుల నుంచి సేకరించిన 30క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని, పౌరసరఫరాల శాఖకు అప్పగించారు. జిల్లాలో రేషన్ దుకాణాల నుంచి మిల్లులు, లేదా లబ్ధిదారుల నుంచి సేకరించి తిరిగి మిల్లులకే తరలిస్తూ జోరుగా రీసైక్లింగ్ చేస్తున్నారు.



సాక్షి, పెద్దపల్లి: విద్యుత్ ఖర్చు ఉండదు. కార్మికులతో పనిలేదు. కొనుగోలు కేంద్రాల నుంచి కేటాయించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండానే అమ్మేస్తున్నారు. సీఎంఆర్ కోసం అడ్డదారిలో బియ్యం తీసుకొస్తున్నారు. రేషన్ దుకాణాలకు వచ్చిన బియ్యం లబ్ధిదారులకు చేరకుండానే తిరిగి కొన్ని మిల్లులు.. అక్కడి నుంచి నేరుగా గోదాంకు చేరుతోంది. మరికొన్ని చోట్ల మంచిర్యాలకు తరలించి అక్కడి నుంచి మహారాష్ట్రకు లారీల ద్వారా తరలిస్తున్నారు. అక్కడ సంచులు, లేబుళ్లను మార్చి తిరిగి జిల్లాలోని కొన్ని రైస్ మిల్లులకు చేరుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మిల్లింగ్ చేయకుండానే..

పౌరసరఫరాల సంస్థ నిబంధనల ప్రకారం ఏటా వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి ఆరు నెలల్లో కేటాయించిన ధాన్యానికి బియ్యం సరఫరా చేయాల్సి ఉన్నా.. కొంతమంది మిల్లర్లు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. కొందరు మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటుండగా.. మరికొందరు ఇతర ప్రాంతంలో బియ్యం కొనుగోలు చేసి మిల్లులకు తీసుకొస్తున్నారు. ఇక్కడి నుంచి వారికి కేటాయించిన గోదాంలకు పంపిస్తున్నారు. ఇంకొంత మంది ప్రభుత్వానికి అందించాల్సిన ఒక సీజన్‌లోని బియ్యాన్ని వాయిదా వేస్తూ మరొక సీజన్‌లో వచ్చే ధాన్యం మిల్లింగ్(మర) చేసి బియ్యం ఇస్తున్నారు. అయితే మిల్లుల్లో ధాన్యం మర ఆడించకుండానే లారీల ద్వారా సరఫరా చేసి ఇతర జిల్లాలు, మహారాష్ట్రలో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

మొక్కుబడిగా విధులు

రేషన్ దుకాణాల్లో అధికారులు తనిఖీలు మరిచిపోయారు. దీంతో కొందరు డీలర్లు గుట్టుచప్పుడు కాకుండా బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఈపాస్ విధానం అమల్లోకి వచ్చాక పర్యవేక్షణ గాడి తప్పింది. ప్రతినెలా ప్రజాపంపిణీ విధానాన్ని తహసీల్దార్లు, ఆర్‌ఐలు పర్యవేక్షించాలి. తహసీల్దార్ నెలలో కనీసం రెండు, ఆర్‌ఐ 10 దుకాణాలు తనిఖీ చేయాలి. సరుకులు, పంపిణీ, నిల్వ వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలి. లబ్ధిదారులతో మాట్లాడి అభిప్రాయాలు తీసుకోవాలి. జిల్లాలో ఆ దిశగా కన్నెత్తి చూడటం లేదు. దీంతో డీలర్లు లబ్ధిదారులకు బియ్యం బదులు కేజీకి రూ.12 నుంచి రూ.15 ఇచ్చి వేలిముద్రలు తీసుకుని దోపిడీకి తెరలేపుతున్నారు. అలా తరలుతున్న బియ్యం పట్టుబడిన ప్రతిసారి వాహన యజమాని, డ్రైవర్‌పై కేసులు నమోదు చేస్తున్న పౌరసరఫరాల శాఖ, పోలీసు అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ప్రతినెలా ఏదోచోట పట్టుబడుతున్నా అసలు అక్రమార్కులు ఎవరనే దిశగా ప్రయత్నాలు చేయడం లేదు.

సన్నబియ్యం జారిపోతోంది..

జిల్లాలో 210కి పైగా పార్‌బాయిల్డ్, రా రైస్ మిల్లులు ఉన్నాయి. ఈ మిల్లులకు ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసి ధాన్యాన్ని కేటాయిస్తుంది. దాన్ని మరడించి సీఎంఆర్ కింద మిల్లర్లు తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలి. అలాగే పర్మిట్లు లేకుండా మిల్లర్లు కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఎక్కడైనా విక్రయించుకునే వెసులుబాటు ఉంది. అయితే దీనిని తమకు అనుకూలంగా మలుచుకుంటున్న కొన్ని మిల్లర్లు సన్నబియ్యం దందా కొనసాగిస్తున్నట్లు యజమానులే చెబుతున్నారు. ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కామన్, ఏ గ్రేడ్, సూపర్ ఫైన్ రకాల కింద పండించిన రైతుల వివరాలతో ట్రక్‌షీట్‌లో రాసి మిల్లులకు తరలిస్తారు. అక్కడే కొందరు మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల వారితో కలిసి చక్రం తిప్పుతున్నారు. కేంద్రానికి వచ్చిన సన్నరకం ధాన్యాన్ని కామన్ కింద నమోదు చేయించి, వాటిని వారి మిల్లులకు తరలించుకున్నారు. వాటిని మరాడించి ఆ బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటునట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం కేటాయించిన ఆ ధాన్యాన్ని భర్తీ చేయడానికి ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి తీసుకొచ్చి మరాడించి సీఎంఆర్ కింద ప్రభుత్వానికి అప్పగిస్తున్నారు. ఇటీవల నెల వ్యవధిలో ఇటువంటి రెండు లారీలు పట్టుబడినా.. అవి మిల్లర్లు బహిరంగమార్కెట్‌లో కొనుగోలు చేసిన ధాన్యంగా గుర్తించి అధికారులు విడిచిపెట్టారు. అయితే మిల్లుల్లో ధాన్యం నిల్వలు, రేషన్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు చేపడితే అసలు విషయం బయటపడుతుందని కొంతమంది మిల్లు యజమానులు చెబుతున్నారు. రేషన్ రీసైక్లింగ్‌పై డీఎస్‌వో వివరణ కోరగా నిత్యం రేషన్ దుకాణాల్లో, మిల్లుల్లో తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాల పేరిట వసూలు..?

- ఒక్కొక్కరి నుంచి రూ.2లక్షలు
- కాంట్రాక్టర్ మారితే పరిస్థితి ఏమిటో?

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫెర్టిలైజర్ కర్మాగారంలో ఉద్యోగాల పేరుతో 22 మంది నుంచి రూ.2లక్షల చొప్పున తీసుకున్నారని సమాచారం. గతంలో ఇలాగే కొందరు కొలువు పెట్టిస్తామని వసూలు చేయగా.. కాంట్రాక్టర్ మారడంతో సుమారు 480 మందిని తొలగించారు. వీరిలో ముంజ అశోక్ అటు డబ్బులు రాక.. ఇటు ఉద్యోగం లేక 2022 ఆగస్టు 27న కమాన్‌పూర్ శివారులో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మరవకముందే కొందరు మరోసారి డబ్బులు వసూలు విషయం వెలుగులోకి వచ్చింది. కర్మాగారంలో పార్క్ మెయింటనెన్స్, హౌస్‌కీపింగ్ ఉద్యోగాలకు రూ.రెండులక్షలు చొప్పున వసూలు చేసి సుమారు 22 మందిని నెలకు రూ.12,800 వేతనానికి పనిలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. సదరు కాంట్రాక్టర్ మారితే వీరిని తొలగించడం ఖాయమని, అప్పుడు వీరి పరిస్థితి ఏమిటని, వారికి డబ్బులు ఎవరిస్తారనే చర్చ నడుస్తోంది. మరోవైపు సంస్థలో కాంట్రాక్ట్ ఉద్యోగాలు శాశ్వతం కాదని, కాంట్రాక్టు ఉద్యోగాల పేరుతో ఎవరైనా వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని యాజమాన్యం నోటీసు బోర్డులు కూడా ఏర్పాటు చేసింది.

'వసూళ్లకు పాల్పడలేదు'

పెద్దపల్లిరూరల్: కర్మాగారంలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వసూళ్లకు పాల్పడలేదని పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేటకు చెందిన శ్రీరాముల గోపాల్ తెలిపారు. జిల్లాకేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. మావోయిస్టుల పేరిట విడుదలైన లేఖలో తన పేరు ఉండడం మానసికంగా ఇబ్బంది కలిగించిందన్నారు. తాను భూకబ్జాలకు పాల్పడలేదని, పంచాయితీల పేరిట ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని, ఏ విచారణకైనా సిద్ధమన్నారు.

దయచేసి వినండి...

సిరిసిల్ల ట్రెయిన్ 21 కి.మీ దూరంలో ఉన్నది!

- వడివడిగా మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే లైన్ పనులు
- ఇటీవల సిద్దిపేట వరకు వచ్చిన రైలు
- త్వరలో సిరిసిల్ల, గుర్రాలగొంది, చిన్నలింగాపూర్‌లో స్టేషన్లు
- ప్లాట్‌ఫారాలు, భవనాలు, గదుల నిర్మాణానికి టెండర్లు
- ఏడాదిలోగా పూర్తి చేసేందుకు చర్యలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఉమ్మడి జిల్లాలో రైల్వే పనులు ఊపందుకున్నాయి. కొత్తపల్లి- మనోహరాబాద్ లైన్ పనులు వడివడిగా సాగుతున్నాయి. ఈ మార్గంలో ఇప్పటికే సిద్దిపేట వరకు రైలొచ్చింది. మిగిలిన రూట్లలోనూ పనులు స్పీడందుకున్నాయి. సిద్దిపేట తర్వాత గుర్రాలగొంది, చిన్నలింగాపూర్, సిరిసిల్ల స్టేషన్ల నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే టెండర్లు జారీ చేసింది. ప్లాట్‌ఫాంలు, భవనాలు, గదులు, అప్రోచ్ రోడ్లు, లైటింగ్, విద్యుత్ యార్డు తదితర పనుల కోసం టెండర్లు జారీచేశారు. మొత్తం టెండరు విలువ రూ. 5,30,27,277గా అధికారులు పేర్కొన్నారు. ఈనెల 25న మధ్యాహ్నం 3 గంటలకు టెండరు ముగింపు గడువుగా తెలిపారు. పనులు ఏడాదిలోగా పూర్తి చేయాలని టెండరులో సూచించారు.

21 కి.మీల దూరంలో పాత కరీంనగర్..

సిరిసిల్ల-సిద్దిపేట మధ్యలో 30 కి.మీ దూరానికి ట్రాక్ వేసేందుకు దాదాపు రూ.440 కోట్ల వ్యయంతో జనవరిలోనే దక్షిణ మధ్య రైల్వే బిడ్డింగులు పిలిచింది. తాజాగా సిరిసిల్ల, గుర్రాలగొంది, చిన్నలింగాపూర్‌లలోనూ స్టేషన్ నిర్మాణాలకు దక్షిణ మధ్య రైల్వే టెండర్లు పిలవడంతో ఈ మార్గంలో జరుగుతున్న పనుల వేగానికి నిదర్శనం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాను హైదరాబాద్‌తో కలిపే కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైను ప్రస్తుతం సిద్దిపేట వరకు పూర్తయింది. ఇటీవల సిద్దిపేటను రైలు కూడా పలకరించింది. సిద్దిపేట తర్వాతి స్టేషన్ గుర్రాలగొంది కేవలం 10 కి.మీ దూరంలో ఉంటుంది. గుర్రాలగొంది- చిన్నలింగాపూర్ మధ్య దూరం 11 కి.మీ. చిన్నలింగాపూర్-సిరిసిల్ల మధ్య 9.కి.మీ దూరం వస్తుంది. గుర్రాలగొంది సిద్దిపేట జిల్లా కాగా, చిన్నలింగాపూర్ సిరిసిల్ల జిల్లాలో ఉంటుంది. ఈ లెక్కన కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే మార్గం పాత ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రవేశించేందుకు కేవలం 21.కి.మీల దూరంలో ఉంది.



77 కి.మీ మేర పూర్తయిన మార్గం..

మనోహరాబాద్ -కొత్తపల్లి (కరీంనగర్) వరకు మొత్తం 151.36 కిలో మీటర్లు బ్రాడ్‌గేజ్‌లైన్. ఈ మార్గంలో ప్రస్తుతం సిద్దిపేట స్టేషన్ (77కి.మీ) వరకు లైన్ పూర్తయింది. ఇక్కడి నుంచి దాదాపు 30 కి.మీ దూరంలో ఉన్న సిరిసిల్ల స్టేషన్ (106.88 కి.మీ) వరకు ప్రస్తుతం పనులు వేగంగా నడుస్తున్నాయి. అక్కడ నుంచి కరీంనగర్ వరకు (151.36 కి.మీ) అంటే దాదాపు 44.48 కి.మీ వరకు ట్రాక్ పనులు సాగాలి. ఇవి 2025 మార్చి వరకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సిరిసిల్లలో కావాల్సిన భూసేకరణకు అధికారులు ఇప్పటికే పచ్చజెండా ఊపారు. దక్షిణ మధ్యరైల్వే అడిగిన భూమిని అటవీ భూమిని ఇచ్చేందుకు ఇటీవల సిరిసిల్ల కలెక్టర్ అనుమతించారు. భూసేకరణ విషయంలో రైల్వే అధికారులతో సిరిసిల్ల-కరీంనగర్ కలెక్టర్లు కూడా పలుమార్లు సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ మార్గం పూర్తయితే జగిత్యాల, పెద్దపల్లి వాసులకు ఢిల్లీ, హైదరాబాద్ వెళ్లేందుకు రైలు ప్రయాణం అందుబాటులోకి వస్తుంది.

కొత్తపల్లి-మనోహరాబాద్ మార్గం విశేషాలు

- మార్గంలో విస్తరించి ఉన్న జిల్లాలు: సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్
- మార్గాన్ని ఆనుకొని వెళ్లే గ్రామాలు: 70
- ఈ రూట్‌లో మొత్తం రైల్వే స్టేషన్లు :15
- పుణ్యక్షేత్రాలు, దర్శనీయ ప్రదేశాలు: వేములవాడ, కొమురవెల్లి, కొండపోచమ్మ, నాచారం లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలు.
- మొత్తం పొడవు 151.36 కి.మీ.
- మెదక్ జిల్లాలో 9.30 కి.మీ.
- సిద్దిపేట జిల్లాలో 83.40 కి.మీ.
- రాజన్నసిరిసిల్లా జిల్లాలో 37.80 కి.మీ.
- కరీంనగర్ జిల్లాలో 20.86 కి.మీ.
- ఇప్పటి వరకూ పూర్తయిన మార్గం 77 కి.మీ

ప్రాజెక్టు నేపథ్యం ఇదీ..

వేములవాడ, సిరిసిల్ల, సిద్దిపేట ప్రజలకు రైలు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో 2006-07లో 151 కి.మీ కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ కోసం రూ.1,167 కోట్ల అంచనా వ్యయం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. తర్వాత ఈ మార్గం ఆర్థికంగా భారమని చెప్పి రైల్వేశాఖ సుముఖత చూపలేదు. మొత్తం బడ్జెట్‌లో 1/3 వంతు ఖర్చుతోపాటు 100 శాతం భూమిని సేకరించి ఇవ్వడం, ఈ మార్గంలో ఐదేళ్ల పాటు వచ్చే నష్టాలను భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకువచ్చింది. దీంతో 2016లో ఈ ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కింది. ఈప్రాజెక్టు త్వరగా పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఇండియా పేరు తొలగించొద్దు

- జమిలి ఎన్నికలు సరికాదు
- ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేసే కుట్ర
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



అభివాదం తెలుపుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం దేశం పేరును భారత్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల మూడోవారంలో పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి రాజ్యాంగ సవరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జమిలి ఎన్నికల అంశాన్ని బీజేపీ వ్యూహాత్మకంగా తెరపైకి తెచ్చిందన్నారు. జమిలి ఎన్నికల నిర్వహణకు బీఎస్పీ వ్యతిరేకమన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేసి రాష్ట్రాల్లో ప్రాంతీయపార్టీల ప్రాబల్యాన్ని తగ్గించాలన్న లక్ష్యంతోనే జమిలి అంశాన్ని ముందుకు తెచ్చారని అన్నారు.

బీసీలంతా ఏకంకావాలి

బీసీలంతా ఏకమైతే అధికారం పెద్ద సమస్య కాదని ప్రవీణ్‌కుమార్ అన్నారు. వివిధ పార్టీల నాయకులు బీఎస్పీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పద్మశాలీలను మోకాళ్లపై నడిపిస్తాననడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని బీఆర్‌ఎస్ నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

ఎదుగుదలను ఓర్వలేకనే బెదిరింపులు

జూలపల్లి: నియోజకవర్గంలో బీఎస్పీకి వస్తున్న ఆదరణ చూడలేకనే ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బెదిరింపులకు పాల్పడుతున్నారని పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆరోపించారు. మండలంలోని వెంకట్రావుపల్లె, చీమలపేటలో మన ఊరు, మన ఉష కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటా తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు.

ఆస్తి విషయమై వివాదం.. అంత్యక్రియలకు బ్రేక్

- మృతదేహాన్ని మార్చురీకి తరలించిన బసంత్‌నగర్ పోలీసులు
- పెద్దపల్లి మండలం సబ్బితంలో ఘటన

పెద్దపల్లిరూరల్: ఓ వృద్ధురాలు అనారోగ్యంతో మరణించగా.. ఆమె ఆస్తి తమకే చెందాలంటూ కుటుంబ సభ్యులు గొడవకు దిగారు. వారి ఘర్షణతో వృద్ధురాలి అంత్యక్రియలు నిలిచిపోయాయి ఈ ఘటన పెద్దపల్లి మండలం సబ్బితంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పెర్క కనకమ్మ, బాలయ్య దంపతులకు సంతానం లేరు. ఐదేళ్ల క్రితం బాలయ్య మరణించాడు. కనకమ్మ సుల్తానాబాద్‌లోని తన సోదరి కూతురు పద్మ వద్ద ఉంటోంది. ఆమె కనకమ్మ పేరిట ఉన్న వ్యవసాయ భూమిని అమ్ముకుందని, ఇంటి స్థలాన్ని పట్టా చేసుకుందని గ్రామస్తులు అంటున్నారు. కనకమ్మ గురువారం అస్వస్థతకు గురికాగా పద్మ సబ్బితం గ్రామానికి తీసుకొచ్చింది. కొద్దిసేపటికే ఆమె చనిపోగా.. అంత్యక్రియలకు గ్రామశివారులో ఏర్పాట్లు చేశారు. దీంతో కనుకమ్మ భర్త బాలయ్య తోబుట్టువులు పెర్క రాయమల్లు, రాజలింగు మృతురాలి ఆస్తిలో తమకు వాటా వస్తుందంటూ వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అంత్యక్రియలకు తవ్వించిన గోతిని పూడ్చివేయించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఫిర్యాదు అందిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

క్లుప్తంగా

పంచాయతీ ట్యాంకర్ టైర్లు చోరీ



టైర్లు లేని ముత్తారం పంచాయతీ వాటర్ ట్యాంకర్

పెద్దపల్లిరూరల్: మండలంలోని ముత్తారం పంచాయతీ వాటర్ ట్యాంకర్ టైర్లను గురువారం వేకువజామున దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల కథనం ప్రకారం ట్యాంకర్‌ను గ్రామంలోని వైకుంఠధామం వద్ద కొద్దిరోజుల క్రితం పార్క్ చేశారు. దీంతో దొంగలు ట్యాంకర్‌ను బోర్ల పడేసి టైర్లను విప్పుకొని వెళ్లిపోయారు. విషయాన్ని సర్పంచ్ ఎద్దు కుమారస్వామి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణ జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

13న మెగా రక్తదాన శిబిరం

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఈనెల13న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్నవారంతా శిబిరానికి హాజరై రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు.

13న రామగుండంకు పవర్ సెక్రటరీ రాక

జ్యోతినగర్: ఈనెల 13న కేంద్ర ప్రభుత్వ పవర్ సెక్రటరీ పంకజ్ అగర్వాల్ ఎన్టీపీసీ రామగుండం తెలంగాణ ప్రాజెక్టు పర్యటనకు రానున్నారు. స్టేజీ-1లోని 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల మొదటి యూనిట్ ఇటీవల 72 గంటల ట్రయల్ రన్ సక్సెస్ కావడంతో యూనిట్ పనితీరును పరిశీలించేందుకు వస్తున్నట్లు తెలుస్తోంది.

ఉరివేసుకుని యువకుడు మృతి

గోదావరిఖని: గోదావరిఖనిలోని పరుశరాంనగర్‌కు చెందిన టంగుటూరి గోపాలకృష్ణ (29) గురువారం ఉరేసుకుని మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. నాలుగేళ్ల క్రితం గోపాలకృష్ణ తల్లి, తండ్రి మృతిచెందారు. అప్పటినుంచి మానసికంగా కుంగిపోయి తాగుడుకు బానిసయ్యాడు. తల్లిదండ్రులను తలుచుకుంటూ మదనపడుతున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడి నానమ్మ టంగుటూరి రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సౌజన్య తెలిపారు.

ప్రైవేటు ఓబీల రూటే సపరేటు

- మెడికల్ వీటీసీ లేకుండానే డ్యూటీలకు..
- అధికారుల ఆదేశాలను పట్టించుకోని వైనం



ఓబీలో పోటా పోటీగా నడుస్తున్న వాహనాలు

గోదావరిఖని: ఓబీ పనులు కనుసన్నల్లో నడవాలని, తమ మాటే వేదంగా ఉండాలని ప్రైవేట్ ఓబీలు గుత్తాధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయి. స్థానికులను కాదని ఇతర రాష్ట్రాల కార్మికులను తెప్పించుకుంటూ సంస్థ నిబంధనలు పక్కన బెట్టి ఓబీ పనులు కొనసాగిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది రక్షణ చర్యలపై ప్రభావం చూపుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. సింగరేణి ప్రైవేట్ ఓబీల్లో తాము చెప్పిందే వేదం.. చేసిందే చట్టం అనేలా సాగుతోందని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సింగరేణి సంస్థ రామగుండం రీజియన్‌లోని ప్రైవేట్ ఓబీ కాంట్రాక్టర్లు సంస్థనే శాసిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని పట్టుబడితే అధికారులపైనే ఒత్తిడి పెంచుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల కాలంలో ప్రమాదాలు పెరగడంతో అధికారులు లోతుగా విచారణ చేపట్టారు. దీంతో అనేక అంశాలు వెలుగుచూస్తున్నాయి. ఓ కార్మికుడు మృతి చెందిన ఓబీ కంపెనీలో వీటీసీ, మెడికల్ లేని కార్మికులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. ఈవిషయంలో అధికారులు సీరియస్‌గా తీసుకుని చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, బిహార్, ఒడిశా ప్రాంతాల నుంచి కార్మికులను తీసుకొస్తున్న ఓబీ సంస్థలు.. వారికి కీలకమైన వొకేషనల్ ట్రైనింగ్(వీటీసీ), వారి ఆరోగ్యానికి సంబంధించిన మెడికల్ పరీక్షలు నిర్వహించడం లేదని తేలింది.

ప్రమాదంతో సీరియస్ విచారణ..

వారం క్రితం ఓ ప్రైవేట్ ఓబీలో జరిగిన ప్రమాదాన్ని యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. కార్మికుడు డోజర్ కింద పడి దుర్మరణం పాలైన ఘటనపై లోతుగా విచారణ చేపట్టడంతో రక్షణపై అనేక అంశాలు వెలుగుచూసినట్లు సమాచారం. కార్మికుడు మృతి చెందిన సంఘటన మర్చిపోకముందే క్యాంపర్ వాహనం బ్రేకులు ఫెయిలయ్యి ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. వరుస సంఘటనలతో సింగరేణి డైరెక్టర్లు సైతం సీరియస్ అయ్యారు. సంస్థ వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓబీల పనితీరుపై సమీక్షించారు. రక్షణ విషయంలో రాజీలేకుండా ముందుకు సాగాలని ఆదేశాలు జారీ చేశారు.

ఇతర రాష్ట్రాల కార్మికులే ఎక్కువ

ప్రైవేట్ ఓబీల్లో పనిచేస్తున్న వారిలో ఇతర రాష్ట్రాల కార్మికులను ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నారు. తక్కువ వేతనాలతో ఎక్కువ పనితీసుకోవాలనే ఉద్దేశంతో ఇతర రాష్ట్రాల కార్మికులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన యువకులను ఎక్కువగా తీసుకొస్తున్నట్లు సమాచారం. తీరా ఇక్కడ పనినచ్చక వచ్చిన కొద్దిరోజులకే వెళ్లిపోతుండటంతో మళ్లీ వచ్చే కార్మికులకు వీటీసీ, మెడికల్ పేరుతో కాంట్రాక్టర్లు సమయాన్ని వృథా చేయలేక నేరుగా విధుల్లోకి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

రక్షణపై అవగాహన లేక ప్రమాదాలు

ఇతర రాష్ట్రాల యువకులకు ఓబీల్లో రక్షణ చర్యలపై అవగాహన ఉండటం లేదంటున్నారు. ఇటీవల చనిపోయిన కార్మికుడిని కూడా కొత్తగా విధుల్లోకి తీసుకున్నట్లు అధికారుల విచారణలో వెలుగుచూసింది. వీటీసీ, మెడికల్ లేకపోవడంతో వారికి ఇక్కడి పనులపై పట్టుసరిగా ఉండటం లేదని అంటున్నారు. ఈ క్రమంలో సింగరేణి సేఫ్టీ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వీటీసీ, మెడికల్ లేని కార్మికులను పంపించినట్లు తెలుస్తోంది.

అధికారులపై ఒత్తిడి

నిబంధనలు పట్టని ఓబీ కాంట్రాక్టర్లను సింగరేణి అధికారులపై ఒత్తిడి పెంచుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ఓ ఏరియాకు చెందిన జీఎం స్థాయి అధికారిని తమ పలుకుబడితో బదిలీ చేయించినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో చాలామంది అధికారులు తమకెందులే అనే ధోరణితో ఓబీ తీరుపై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రైవేట్ ఓబీల్లో ఇతర రాష్ట్రాల కార్మికులపై నజర్

ప్రైవేట్ ఓబీల్లో వీటీసీ, మెడికల్‌లేకుండా యంత్రాలు నడిపిస్తున్న ఇతర రాష్ట్రాల వలస కార్మికులపై అధికారులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు. వీటీసీలేని వారిని పనుల్లో పక్కకు పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. రీజియన్‌లోని మూడు ఏరియాల్లో సుమారు 300మందికి పైగా వీటీసీ, మెడికల్ లేకుండానే ఓబీ క్యాంపు కార్యాలయాల్లో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. వీరంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారేనని తెలిసింది.

రక్షణ చర్యల్లో రాజీ పడే ప్రసక్తేలేదు

ప్రైవేట్ ఓబీ పనుల్లో రక్షణ విషయంలో రాజీపడం. నిబంధనలకు అనుగుణంగా ముందుకెళ్లాం. ఇటీవల జరిగిన ప్రమాదంపై విచారణ కొనసాగుతోంది. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. దీనిపై ప్రత్యేకంగా అధికారులను నియమించాం.

– ఎల్‌వీ.సూర్యనారాయణ, ఆర్జీ–2 జీఎం

బొగ్గుబాయి వార్తలు

మైనింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



వినతిపత్రం అందిస్తున్న మైనింగ్ సిబ్బంది

గోదావరిఖని: మైనింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్‌చేశారు. గని ప్రమాదాల్లో మైనింగ్ స్టాఫ్‌ను బాధ్యులను చేయడాన్ని ఖండించారు. కేటీకే–8 గని బ్లాస్టింగ్ ప్రమాదంలో మైనింగ్ సూపర్‌వైజర్లపై తీసుకున్న క్రమశిక్షణ చర్యలను రద్దు చేయాలని, అండర్ మేనేజర్ పదోన్నతికి (ఈ–2) ఉన్న పద్ధతిని మార్చాలని కోరారు. క్యాడర్ స్కీం మార్చి, సెప్టెంబర్‌తో చాలామంది సర్వీస్ కోల్పోతున్నారని, పదోన్నతి తేదీని బట్టి అదేరోజు గ్రేడ్ ప్రమోషన్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆకుల హరిణ్, సాయవేణి సతీశ్, మాదాసి రవీందర్, మంచినీళ్ల స్వామి, పల్లె శ్రీనివాస్, పోరండ్ల వెంకటేశం, నీలం శ్రీనివాస్, నూతి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

యాక్టింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలో యాక్టింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నెలక్రితం సర్క్యులర్ జారీ చేసినా ఇప్పటివరకు భర్తీ చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. 2016 ఆర్జీ–1లో సర్ఫేజ్ జనరల్ మజ్దూర్ పోస్టులను భర్తీ చేశారని, తర్వాత సర్‌ఫేజ్ జనరల్ మజ్దూర్ల భర్తీ లేకుండా పోయిందని, కేవలం యాక్టింగ్ కార్మికులతో కాలం వెళ్లదీస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల సర్‌ఫేజ్ జనరల్ మజ్దూర్‌ల కోసం సర్క్యులర్ జారీ చేసి నెల గడిచినా ఇప్పటివరకు లిస్ట్ ఫైనల్ కాలేదన్నారు. దీనిపై విజిలెన్స్ దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్మికుల మనోభావాలతో సంస్థ చెలగాటమాడుతోందని, 23నెలల వేతన బకాయిలు త్వరలో చెల్లిస్తామని యాజమాన్యం చెప్తోందని, దీనిపై స్పష్టమైన తేదీ తెలపాలన్నారు. బకాయిల చెల్లింపు విషయంలో కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు.

ఏరియర్స్ చెల్లించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

రామగిరి: సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ చెల్లించాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీ.రావు డిమాండ్ చేశారు. సెంటినరీకాలనీలో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఆర్జీ–3 జీఎం కార్యాలయం ఎదుట తలపెట్టిన ఒకరోజు నిరాహారదీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కోల్‌ఇండియా యాజమాన్యం కార్మికులకు వేజ్‌బోర్డు ఏరియర్స్ ఒకేసారి చెల్లించారని, అదే తరహాలో సింగరేణి కార్మికులకు కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. సంస్థ లాభాల్లో నడుస్తున్న కార్మికులకు ఇచ్చే ఏరియర్స్ విషయంలో రెండు విడుతలని చెప్పడం సరికాదని, ఏరియర్స్‌ను ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేశారు. లాభాలో వాటాల్లో 35 శాతం వాటాను చెల్లించాలని పేర్కొన్నారు. టీబీజీకేఎస్ యూనియన్ కార్మికుల పక్షాన పోరాడకుండా యాజమాన్యంతో కుమ్మక్కై తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి జూపాక రాంచందర్, బ్రాంచ్ కార్యదర్శి ఎంఆర్‌సీ రెడ్డి, నాయకులు డీటీ రావు, రవి కుమార్, కిరణ్‌కుమార్, రాజు, గంగాధర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వేజ్‌బోర్డు బకాయిలు చెల్లించాలి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల 11వ వేజ్‌బోర్డు బకాయిలు చెల్లించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కోలిండియా సర్క్యులర్ ప్రకారం సెప్టెంబర్‌3న బకాయిలు ఇవ్వాల్సి ఉన్నా చెల్లించలేదన్నారు. సంస్థకు రూ.2,220 కోట్ల లాభాలు వచ్చినప్పటికీ పట్టించుకోకపోవడం సరికాదన్నారు. వేజ్‌బోర్డు ఏరియర్స్, లాభాల వాటా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జెన్‌కో, ట్రాన్స్‌కో బకాయిలు చెల్లించకపోవడంతో జాప్యం అవుతోందన్నారు. సకాలంలో చెల్లించకపోతే సింగరేణి వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సింగరేణి సీఎస్ఆర్ నిధులు ఈప్రాంతంలోనే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నర్సింహారెడ్డి, ధర్మపురి, లక్ష్మీపతి, కె.సదానందం, జగన్‌మోహన్ రెడ్డి, దామోదర్, నాగరాజు, దేవేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో విధులు నిర్వహించాలి

- రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య



మాట్లాడుతున్న అధికారులు

గోదావరిఖని: రక్షణతో విధులు నిర్వహించి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య పేర్కొన్నారు. గురువారం జీడీకే–11గనిపై ఏర్పాటు చేసిన సేఫ్టీ సమావేశంలో మాట్లాడారు. ఏ బీ సీ డీ విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. నా భద్రత, నా బాధ్యత నినాదంతో ముందుకు సాగాలన్నారు. గని ఏజెంట్ శ్రీనివాస్, మేనేజర్ నెహ్రూ, సెక్షన్ ఇన్‌చార్జిలు జాన్సన్, మల్లేశ్, హనుమాండ్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ పాలనను అంతం చేద్దాం

ఓదెల: బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల నిరంకుశపాలనను అంతం చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు తెలిపారు. మండలంలోని పొత్కపల్లిలో హాథ్‌సేహాథ్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో అవినీతి, దోపిడీ పెరిగిందని, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ అంబాల కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దాం

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు హర్కర వేణుగోపాల్



మాట్లాడుతున్న హర్కర వేణుగోపాల్

జ్యోతినగర్: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడాలని కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు హర్కర వేణుగోపాల్ అన్నారు. హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్‌తో కలిసి గురువారం మాట్లాడారు. రామగుండంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు అందరు కలిసికట్టుగా పాల్గొనాలని తెలిపారు. ఎవరికి టికెట్ ఇచ్చినా అంకితభావంతో పనిచేసి విజయం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో వాజిద్, రహీం, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చుకోవాలి



మహిళారైతులతో మనాలి ఠాకూర్

రామగుండం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతిఒక్కరూ కష్టపడాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సతీమణి మనాలీఠాకూర్ అన్నారు. అంతర్గాం మండలంలోని ఆకెనపల్లి, ఎగ్లాస్‌పూర్‌లో గురువారం పర్యటించారు. చేలలో మహిళా రైతులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే రైతుకూలీలకు రూ.12వేలు అందిస్తామని, తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులు అందిస్తామని పేర్కొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత



నియామకపత్రాలు అందిస్తున్న జీఎంలు

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలో మెడికల్ అన్‌ఫిట్, చనిపోయిన ఉద్యోగుల డిపెండెంట్లకు గురువారం ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు కారుణ్య నియామకపత్రాలు అందజేశారు. సింగరేణిలో ఉద్యోగం రావడం వరమని, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, రక్షణ చర్యలు పాటిస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడలని సూచించారు. అధికారుల సంఘం ప్రతినిధి సునీల్‌ప్రసాద్, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఎస్ఎస్‌వో లక్ష్మీనారాయణ, సీనియర్ పీవో రాజేశం, టీబీజీకేఎస్ ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, జీఎం కమిటీ సభ్యుడు నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో వేగంగా పార్సిళ్లు

పెద్దపల్లిరూరల్/గోదావరిఖనిటౌన్: తక్కువ ఖర్చుతో పార్సిళ్లను వేగంగా చేరవేసేలా తపాలా శాఖ చర్యలు చేపట్టింది. డాక్ నిర్యాత్ కేంద్ర, పార్సిల్ ప్యాకింగ్ యూనిట్లు రైల్వే శాఖతో జాయింట్ పార్సిల్ సేవలను అందుబాటులోకి తెచ్చాయని పోస్టల్ పెద్దపల్లి సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్, గోదావరిఖని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మేరుగు శ్రీనివాస్ తెలిపారు. డాక్‌నిర్యాత్ కేంద్రలో భాగంగా పోస్ట్ ఆఫీస్ కస్టమ్స్ డిపార్ట్‌మెంట్‌తో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. విదేశాలకు పార్సిల్స్ పంపే వారికి ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తక్కువ ఖర్చుతో కస్టమ్స్ అధికారుల నుంచి వేగంగా క్లియరెన్స్ లభిస్తుందని తెలిపారు. ఈ సర్వీస్‌లో నమోదు చేసుకున్న వారికి పోస్టల్ సిబ్బంది వారి ఇంటి వద్దకే వచ్చి సేవలు అందిస్తారని తెలిపారు.

పార్సిల్ ప్యాకింగ్ యూనిట్

పార్సిల్ ప్యాకింగ్ యూనిట్‌లో భాగంగా పార్సిళ్లను పోస్టాఫీస్‌లోనే ప్యాకింగ్ చేస్తారని ప్రభాకర్ తెలిపారు. పార్సిల్ విలువ, తూకం పద్ధతిలో పార్సిల్ బరువును కొలిచి తక్కువ ఖర్చుతో దేశ, విదేశాలకు పంపిస్తామన్నారు. తపాలా శాఖ ఇండియన్ రైల్వేస్‌తో ఒప్పందం కుదుర్చుకుందని, దానికి 'రైల్ పోస్ట్ గతి శక్తి ఎక్స్‌ప్రెస్ కార్గో సర్వీసెస్' పేరిట వ్యవహరిస్తున్నారని వివరించారు. 35 కిలోల కంటే ఎక్కువ ఉన్న బరువున్న పార్సిళ్లను రైల్వేశాఖ సహకారంతో తపాలాశాఖ సిబ్బంది ఇంటి వద్దనుంచి తీసుకెళ్లడం, మనకు వచ్చిన పార్సిళ్లను ఇంటి వద్దనే డెలివరీ చేస్తారని తెలిపారు. పార్సిళ్లకు ఇన్సూరెన్సు కూడా చేయించుకోవచ్చని పేర్కొన్నారు. దేశ, విదేశాలకు పార్సిళ్లను పంపించాలనుకునే వారంతా పెద్దపల్లి ప్రధాన తపాలా కార్యాలయంలో సంప్రదించి సేవలు పొందాలని కోరారు.






సుల్తానాబాద్‌లో శిథిలావస్థలో ఇళ్లు

మట్టిగోడల మధ్య బిక్కుబిక్కుమంటూ..



కూలిపోయిన ఇంట్లోనే జీవనం సాగిస్తున్న మంద రాజమల్లమ్మ

వరుణుడు విరుచుకుపడుతుండడంతో శిథిలావస్థలో ఉన్న ఇళ్లు ఎప్పుడు కూలిపోతాయోననే భయం ప్రజలను వెంటాడుతోంది. సుల్తానాబాద్‌లోని జెండా పాతబజార్, గౌడవీధి, గంగపుత్రులకాలనీలో చాలా ఇళ్లు ఇదిగో ఇలా శిథిలావస్థలోకి చేరాయి. మున్సిపల్ అధికారులు స్పందించి మట్టిగోడల ఇళ్లలో నివాసముండే వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. పోచమ్మవాడకు చెందిన మంద రాజమల్లమ్మ ఇల్లు ఇటీవలి వర్షానికి కూలిపోయింది. దీంతో ఆమె బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

